మోదీకి 3 లక్షల ఓట్లు మైనస్

వారణాసిలో భారీగా తగ్గిన ప్రధాని మెజారిటీ

వారణాసి: ప్రధానమంత్రి మోదీకి వారణాసి ఓటర్లు ఝలక్ ఇచ్చారు. 2014లో 3.71 లక్షలు, 2019లో 4.79 లక్షల భారీ మెజారిటీతో విజయం సాధించిన మోదీకి ఈ ఎన్నికల్లో మాత్రం మెజారిటీ భారీగా తగ్గిపోయింది. 1.52 లక్షల మెజారిటీ మాత్రమే ఆయన దక్కించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్.. మోదీకి గట్టి పోటీ ఇచ్చారు. మొదటి రౌండ్లలో మోదీ వెనుకబడి పోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. గత పదేండ్లలో వారణాసిలో భారీగా అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పుకున్నప్పటికీ మెజారిటీ తగ్గడం ప్రధాని మోదీకి ఇబ్బందికరంగా మారింది. ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోనే రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ దాదాపు 4 లక్షల ఓట్ల భారీ మెజారిటీ దక్కించుకోవడం గమనార్హం.

బీజేపీకి యూపీ దెబ్బ

ఉత్తరప్రదేశ్‌లో భారీగా తగ్గిన బీజేపీ సీట్లు

- అనూహ్యంగా పుంజుకున్న సమాజ్‌వాదీ
- అయోధ్య ఆలయం ఉన్న చోటా బీజేపీ ఓటమి
- రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ జయభేరీ

లక్నో, జూన్ 4: బీజేపీ ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉత్తరప్రదేశ్ ప్రజలు ఈసారి ఆ పార్టీకి చేదు ఫలితాలను మిగిల్చారు. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రంలో బీజేపీ భారీగా సీట్లు కోల్పోయింది. యూపీలోని మొత్తం 80 నియోజకవర్గాలకు గానూ బీజేపీ 2014లో 71 స్థానాలను, 2019లో 62 స్థానాలను గెలుచుకున్నది. ఈ ఎన్నికల్లో మాత్రం బీజేపీ 74 స్థానాల్లో పోటీ చేసి 33 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీ పొత్తు ఇక్కడ బీజేపీ సీట్లకు భారీగా గండి కొట్టింది. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ అనూహ్యంగా పుంజుకున్నది. అయోధ్య రామమందిర నిర్మాణం బీజేపీకి రాజకీయంగా లాభం చేకూర్చలేదు. ఆ పార్టీ గొప్పగా చెప్పుకున్న యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ పాలసీ బెడిసికొట్టింది. రాష్ట్రం నుంచే పోటీ చేసినప్పటికీ మోదీ మ్యాజిక్ ఈసారి పని చేయలేదు. అప్నాదల్(సోనేవాల్), ఆర్ఎల్‌డీ, సుహల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, నిషాద్ పార్టీలతో పొత్తు కుదుర్చుకొని, సామాజిక సమీకరణాలను అనుకూలంగా మార్చుకునేందుకు కమలం పార్టీ చేసిన ప్రయత్నాలు కూడా అంతగా ఫలించలేదు.

యూపీ మొత్తం(80)	
ఎన్డీయే	37
ఇండియా	42
ఇతరులు	1

బీజేపీ స్పీడ్‌కు ఇండియా కూటమి బ్రేకులు

ఉత్తరప్రదేశ్‌లో పదేండ్ల తర్వాత మొదటి సారి బీజేపీ దూకుడుకు బ్రేకులు పడ్డాయి. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీల పొత్తు ఇండియా కూటమికి సత్ఫలితాలను ఇచ్చింది. 2014లో కేవలం 5 స్థానాలు, 2019లో 5 స్థానాలకే పరిమితమైన సమాజ్‌వాదీ పార్టీ ఈసారి 62 స్థానాల్లో పోటీ చేసి ఏకంగా 37 స్థానాలను కైవసం చేసుకుంది. 2019లో ఒకే ఒక్క స్థానానికి పరిమితమై ఉనికి కోల్పోయే స్థితిలో ఉన్న కాంగ్రెస్ ఈసారి ఆరు స్థానాలను గెలుచుకుంది. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఓడిపోయిన అమేథీలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి కిశోరీలాల్.. స్మృతి ఇరానీని ఓడించారు.

బీజేపీకి వ్యతిరేకంగా సైలెంట్ వేవ్

ఉత్తరాదిలో బీజేపీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, హిందీ రాష్ట్రాల్లో ఆ పార్టీకి ఎదురులేదని పదేండ్లుగా ఉన్న భావన ఈ ఎన్నికలతో తేలిపోయింది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం వంటి అంశాల ప్రభావం సైలెంట్ వేవ్‌లా పని చేసింది. జనంలో ఉన్న ఈ అసంతృప్తి ఎగ్జిట్ పోల్స్‌లో కనిపించకపోయినా ఈవీఎంలలో స్పష్టమైంది. బయటకు పెద్దగా వ్యతిరేకత కనిపించకపోయినా జనం పోలింగ్ బూత్‌లో మాత్రం ప్రభుత్వ వ్యతిరేకతను దాచుకోలేదు. ఇది బీజేపీని ఓడించే స్థాయిలో లేకపోయినా ఓటమికి చేరువ చేసే స్థాయిలో మాత్రం కనిపించింది.

గెలిచి ఓడిన మోదీ పార్టీ!

మొదటిపేజీ తరువాయి...

పార్టీ పరిమితమైంది. బీజేపీ భారీ విజయం సాధిస్తుందనుకున్న ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో ఆ పార్టీకి మింగుడు పడని ఫలితాలు వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ.. బీజేపీని గట్టి దెబ్బ కొట్టాయి. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆదుకోకపోతే బీజేపీ ఈసారి అధికారం కోల్పోయే పరిస్థితి వచ్చేది. బీజేపీని రెండుసార్లు కేంద్రంలో అధికారం లోకి తెచ్చిన మోదీ వేవ్‌కు కూడా ఇక పుల్ స్టాప్ పడ్డట్టే అయ్యింది.

గట్టి పోటీ ఇచ్చిన ఇండియా కూటమి

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ ఎన్డీయేకు ఇండియా కూటమి గట్టి పోటీ ఇచ్చింది. 2014లో 44, 2019లో 52 స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో 99 స్థానాలను దక్కించుకుంది. గత రెండు ఎన్నికల్లో 5 సీట్లే గెలుచుకున్న సమాజ్‌వాదీ పార్టీ ఈసారి 37 సీట్లకు ఎగబాకింది. 29 స్థానాలతో తృణమూల్ కాంగ్రెస్, 22 స్థానాలతో డీఎంకే కూడా మంచి ఫలితాలు సాధించడంతో ఇండియా కూటమి ఎన్డీయేకు గట్టి పోటీ ఇచ్చింది. ఒక దశలో బీజేపీ అధికారం లోకి రాదేమోననే భావనను కల్పించింది.

మొత్తం లోక్‌సభ స్థానాలు- 543	
ఎన్డీయే	293
ఇండియా	233
ఇతరులు	17

వికసిత్ భారత్ కోసం ప్రతి ఒక్కరితో పనిచేస్తాం

చంద్రబాబు, నితీశ్‌లకు అభినందనలు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ కోసం ప్రతి ఒక్కరితో కలిసి పనిచేస్తామని ప్రధాని మోదీ అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాలతో కలిసి పనిచేస్తామని ప్రధాని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌లలో ఎన్డీయే కూటమి విజయానికి కారణమైన టీడీపీ అధినేత చంద్రబాబు, బీహార్ సీఎం నితీశ్‌కుమార్‌లకు అభినందనలు తెలియజేశారు. మూడో దఫా అధికారం చేపట్టాక, అవినీతిని రూపుమాపటంపై ఎక్కువగా దృష్టి సారిస్తాం' అని అన్నారు. బీజేపీ మెజార్టీ మార్క్‌ను అందుకోలేకపోయినా, వివిధ అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిందని చెప్పుకున్నారు.

మోదీ రాజీనామా చేయాలి: మమత

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకోసం ప్రధాని మోదీ ఇప్పుడు టీడీపీ, జేడీయూ నితీశ్ కాళ్లపై పడతారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆమె కోల్‌కతాలో విలేకరులతో మాట్లాడుతూ, 'ప్రధాని మోదీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో 400కుపైగా స్థానాలు గెలుచుకుంటామని చెప్పుకున్న ప్రధాని మోదీ, కనీసం సొంతంగా మెజార్టీ సాధించలేకపోయారు' అని అన్నారు. బుధవారం ఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి టీఎంసీ జనరల్ సెక్రెటరీ అభిషేక్ బెనర్జీ హాజరవుతారని చెప్పారు.

కింగ్‌మేకర్లుగా చంద్రబాబు, నితీశ్

- ఢిల్లీ పీఠాన్ని నిర్ణయించేది వీరే!
- బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ రాని నేపథ్యంలో కీలకం
- కూటమి ధర్మానికి కట్టుబడతారా? లేదా? అన్నది ఆసక్తికరం

ఢిల్లీ, జూన్ 4: సరిగ్గా ఎనిమిది నెలల క్రితం ఆ ఇద్దరు నేతలను ఎవరూ పట్టించుకోలేదు. భవిష్యత్తులో వారు దేశ రాజకీయాలను శాసిస్తారని ఎవరూ ఊహించి ఉండరు. ఏకంగా దేశాన్ని ఏలే ప్రధానిని నిర్ణయించే కింగ్‌మేకర్లుగా అవతరిస్తారని అస్సలు అనుకొని ఉండరు. వారెవరో కాదు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు. సరిగ్గా 8 నెలల క్రితం చంద్రబాబు అవినీతి ఆరోపణలపై రెండు నెలల పాటు జైలుకు వెళ్లారు. కూటముల మార్పిడితో నితీశ్ కుమార్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ రాని నేపథ్యంలో ఢిల్లీ పీఠంపై ఎవరూ కూర్చోవాలనేది వారే నిర్ణయించనున్నారు.

మ్యాజిక్ ఫిగర్ దూరంలో బీజేపీ

తాజా సార్వత్రిక ఎన్నికల్లో దేశప్రజలు స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి ఇవ్వలేదు. ఇండియా కూటమి 233 సీట్లలో గెలుపొందగా.. ఎన్డీయే కూటమి 293 సీట్లు సాధించింది. అయితే సొంతంగా 241 స్థానాల్లో మాత్రమే విజయం సాధించిన కమలం పార్టీ మ్యాజిక్ ఫిగర్‌కు 31 స్థానాల దూరంలో నిలిచిపోయింది. దీంతో ఎన్డీయే కూటమికి మిత్రపక్షాల మద్దతు అనివార్యంగా మారింది. అదే సమయంలో 233 స్థానాల్లో గెలుపొందిన ఇండియా కూటమికి 39 స్థానాలు కావాల్సి ఉండటంతో ఆసక్తికరంగా మారింది.

వీరిద్దరే కీలకం

అయితే ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ 16 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. ఆ పార్టీ మిత్రపక్షం జనసేన రెండు చోట్ల గెలుపొందింది. మరోవైపు బీహార్‌లో నితీశ్ కుమార్ నాయకత్వంలోని జేడీయూ 12 స్థానాల్లో గెలుపొందింది. ఎన్డీయే కూటమిలో బీజేపీ తర్వాత ఈ రెండే పెద్ద పార్టీలు కావడం గమనార్హం. బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ దక్కకపోవడంతో నితీశ్ కుమార్, చంద్రబాబు మద్దతు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో తమ వ్యూహం ఏమిటనేది ముందే చెప్పేస్తే మోదీ జాగ్రత్త పడతారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పడం ఆసక్తికరంగా మారింది.

బీజేపీని కరుణించని అయోధ్య రామయ్య

- పని చేయని రామమందిర నినాదం
- అయోధ్య ఉన్న ఫైజాబాద్‌లోనూ బీజేపీకి తప్పని పరాభవం

లక్నో, జూన్ 4: భారతీయ జనతా పార్టీని ఈ ఎన్నికల్లో అయోధ్య రామయ్య కరుణించలేదు. దశాబ్దాలుగా అయోధ్యలో రామమందిరాన్ని నిర్మిస్తామనే నినాదంతో ఎన్నికలకు వెళ్తూ రాజకీయంగా ఎదిగింది బీజేపీ. అయితే, ఇప్పుడు రామమందిర నిర్మాణం పూర్తయినప్పటికీ ఈ అంశం బీజేపీకి రాజకీయంగా లబ్ధి కలిగించలేదు. మందిర నిర్మాణం తమకు రాజకీయంగా లాభం చేకూరుస్తుందని బీజేపీ భారీగా ఆశలు పెట్టుకుంది. నిజానికి, రామమందిర నిర్మాణం మొత్తం పూర్తి కాకముందే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారనే విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. దేశమంతా హిందువుల ఓట్లను ఆకర్షించేందుకు మందిర నిర్మాణాన్ని ఎన్నికల ప్రచార అంశంగా మార్చుకుంది. అయితే, దేశవ్యాప్తంగా బీజేపీ సీట్లు తగ్గిపోవడం చూస్తే రామమందిర నిర్మాణం ద్వారా బీజేపీ ఆశించిన రాజకీయ ప్రయోజనం ఆ పార్టీకి దక్కనట్టు స్పష్టమవుతున్నది. అయోధ్య ఉన్న ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ భారీగా సీట్లు కోల్పోయింది. ఆఖరికి రామమందిరం ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ బీజేపీ ఓటమి పాలయ్యింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి లల్లూ సింగ్‌పై సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అవదేశ్ ప్రసాద్ విజయం సాధించారు.

బెంగాల్‌లో దీదీ దూకుడు

- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు
- పట్టును నిలుపుకొన్న మమతాబెనర్జీ
- బీజేపీకి ఊహించని ఎదురుదెబ్బ

మమతాబెనర్జీ పోస్టర్‌కు రంగులు పూసి సంతోషం వ్యక్తం చేస్తున్న టీఎంసీ కార్యకర్త

కోల్‌కతా, జూన్ 4: మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ పశ్చిమబెంగాల్‌లో జోరు కనబరిచింది. బెంగాల్‌లో భారీగా సీట్లు సాధించాలన్న బీజేపీ ఆశలకు మమత గండికొట్టారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీఎంసీ దూసుకెళ్లింది. హోరాహోరీగా జరిగిన పోరులో టీఎంసీ తన పట్టును నిలుపుకొంది. రాష్ట్రంలో మొత్తం 42 ఎంపీ స్థానాలుండగా 29 స్థానాలను టీఎంసీ కైవసం చేసుకున్నది. పశ్చిమబెంగాల్‌పై భారీగా ఆశలు పెట్టుకున్న బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ 12 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు కాంగ్రెస్ ఒకేఒక్క స్థానంలో ఆధిక్యంలో ఉన్నది.

అభిషేక్ బెనర్జీకి భారీ మెజారిటీ...

ఇండియా కూటమికి దూరంగా ఉన్న టీఎంసీ ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగి సత్తా చాటింది. బీజేపీని దీటుగా ఎదుర్కొంది. ఆ పార్టీ ముఖ్య నేతలు అభిషేక్ బెనర్జీ, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్, శతృఘ్న సిన్హా, క్రికెటర్ యూసుఫ్ పఠాన్ గెలుపు తీరాలకు చేరారు. అభిషేక్ బెనర్జీ 7 లక్షలకు పైగా మెజారిటీ సాధించడం గమనార్హం.

అధీర్ రంజన్ చౌదురి ఓటమి...

ఈ ఎన్నికల్లో 2019 నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేయడంలో బీజేపీ విఫలమైంది. గత ఆ పార్టీ 18 స్థానాల్లో గెలుపొందగా.. ఈ సారి 12 స్థానాలతోనే సరిపెట్టుకుంది. మరోవైపు కాంగ్రెస్ తీవ్రంగా నిరాశపరిచింది. ఆ పార్టీ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదురీ.. క్రికెటర్ యూసుఫ్ పఠాన్ చేతిలో ఓటమి పాలయ్యారు. కాగా, ఓట్ల శాతంలోనూ టీఎంసీ దూకుడు ప్రదర్శించింది. అధికార టీఎంసీ 47 శాతానికి పైగా ఓట్లను దక్కించుకోగా, బీజేపీ 37 శాతం, కాంగ్రెస్ 4 శాతం ఓట్లు దక్కించుకున్నాయి.

మోదీ-షా వ్యూహాలకు చెక్...

సార్వత్రిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ, టీఎంసీ బెంగాల్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. టీఎంసీని నిలువరించి, తద్వారా మమతాబెనర్జీని అడ్డుకోవాలనే ఉద్దేశంతో బీజేపీ వ్యూహాలు రచించింది. అందుకే బీహార్, ఉత్తరప్రదేశ్‌తో పాటు పశ్చిమబెంగాల్‌లోనూ ఏడు విడతల్లో ఎన్నికలు ఉండేలా ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేయించింది. అయితే బీజేపీ వ్యూహం ఫలించలేదు. బీజేపీ వ్యూహాన్ని గ్రహించిన మమతా బెనర్జీ సొంత రాష్ట్రంలో పట్టు నిలుపుకొనేందుకు ఇండియా కూటమికి సైతం దూరమయ్యారు. సొంత రాష్ట్రానికే పరిమితమై, అంతా తానై నడిపించారు. తద్వారా మోదీ-షా వ్యూహాలకు చెక్ పెట్టారు.

పశ్చిమబెంగాల్ (42)	
టీఎంసీ	29
ఎన్డీయే	12
ఇండియా	1

ఛత్తీస్‌గఢ్ (11)	
బీజేపీ	10
కాంగ్రెస్	1

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు చుక్కెదురు

- ఒక్కస్థానంలోనే గెలుపు
- 10 స్థానాల్లో బీజేపీ ఆధిక్యం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 11 లోక్‌సభ సీట్లలో 10 స్థానాల్లో విజయం సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ తొమ్మిదింటిలో విజయం సాధించగా, కాంగ్రెస్ రెండింటిని కైవసం చేసుకుంది. ఈ సారి అదనంగా బస్తర్‌లో బీజేపీ విజయం సాధించింది. మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి భూపేశ్ బఘేల్ రాజ్‌నందన్‌గావ్‌లో బీజేపీ అభ్యర్థి కన్నా వెనుకబడి ఉన్నారు. కోర్బా స్థానంలో పోటీ చేసిన సిట్టింగ్ ఎంపీ, అసెంబ్లీ విపక్ష నేత చంద్రదాస్ సతీమణి జ్యోత్స్న మహంత్ మాత్రమే కాంగ్రెస్ నుంచి ఆధిక్యంలో ఉన్నారు. కాగా, రాయ్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి అగ్రవాల్ కాంగ్రెస్ అభ్యర్థిపై 5.23 లక్షలు, దుర్గ్‌లో బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ విజయ్ బఘేల్ కాంగ్రెస్ అభ్యర్థిపై 4.38 లక్షలకు పైగా మెజారిటీ సాధించారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఝలక్

- మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొన్న బీజేపీ
- డిప్యూటీ సీఎం డీకే సోదరుడు సురేశ్ ఓటమి
- 42 వేల ఓట్ల తేడాతో ప్రజ్వల్ పరాజయం

కర్ణాటక (28)	
ఎన్డీయే	19
ఇండియా	9

బెంగళూరు, జూన్ 4: కర్ణాటకలో అధికార కాంగ్రెస్‌కు గట్టి షాక్ తగిలింది. రాష్ట్రంలోని 28 స్థానాలకుగానూ 17 సీట్లను ప్రతిపక్ష బీజేపీ కైవసం చేసుకోగా.. హస్తం పార్టీ తొమ్మిది స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీజేపీ మిత్రపక్షం జేడీఎస్ 2 చోట్ల గెలిచింది. గెలిచిన వారిలో మాజీ సీఎంలు బసవరాజ్ బొమ్మై, హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే అల్లుడు రాధాక్రిష్ణ దొడ్డమణి ఉన్నారు. మరోవైపు రాష్ట్ర డిప్యూటీ సీఎం, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ బెంగళూరు రూరల్ లోక్‌సభ స్థానం నుంచి 2,69,647 లక్షల ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి, దేవెగౌడ అల్లుడు సీఎన్ మంజునాథ్ చేతిలో ఘోర పరాజయం చవిచూశారు. గత కొన్ని రోజులుగా సెక్స్ స్కాండల్ ఆరోపణల్లో నలుగుతున్న ప్రజ్వల్ రేవణ్ణ పరాజయం పాలయ్యారు. హసన్ నుంచి పోటీచేసిన ప్రజ్వల్ రేవణ్ణ కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయాస్ ఎం పటేల్ చేతిలో 42,649 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

మార్పునకు అనుకూలం: శరద్ పవార్

ముంబై, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దేశంలో రాజకీయ మార్పులకు అనుకూలంగా ఉన్నాయని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ తెలిపారు. ముంబైలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందో, లేదో కచ్చితంగా తెలియదని చెప్పారు. కేంద్రంలో బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు లేని నేపథ్యంలో చంద్రబాబు, నితీశ్ కుమార్‌తో తాను మాట్లాడినట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. తర్వాతి దేశ ప్రధాని ఎవరని విలేకర్లు ప్రశ్నించగా.. దాని గురించి ఇంకా తాము ఆలోచించలేదని ఆయన సమాధానమిచ్చారు.

లెఫ్ట్ పార్టీలకు ఊపిరి!

తాజా ఎన్నికల్లో 8 సీట్లు కైవసం

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో అస్తిత్వం కోసం పోరాడుతున్న వామపక్షాలు గతంతో పోలిస్తే కాస్త మెరుగైన ఫలితాలు సాధించాయి. తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీలు 8 స్థానాలను దక్కించుకున్నాయి. గత లోక్‌సభలో కేవలం మూడు సీట్లు కలిగిన సీపీఐ(ఎం) తాజా ఎన్నికల్లో మొత్తం నాలుగు చోట్ల గెలుపొందింది. సీపీఐ, సీపీఐ(ఎం)(ఎల్) చెరో రెండు స్థానాల్లో విజయం సాధించాయి. మరికొన్ని చోట్ల వామపక్షాలు గట్టి పోటీని ఇచ్చాయి.

జేడీయూ, టీడీపీతో చర్చలపై నేడు నిర్ణయం: రాహుల్

న్యూఢిల్లీ: ఇండియా కూటమి పాత మిత్రపక్షాలు జేడీయూ, టీడీపీతో చర్చలపై బుధవారం నిర్ణయం తీసుకొంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయనను కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించగా, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలతో సమావేశం అవుతామని, చర్చల్లో తీసుకొనే నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్తామని వెల్లడించారు. వయనాడ్, రాయ్‌బరేలీలలో ఏ స్థానాన్ని వదులుకోవాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు.

తమిళనాడులో ఇండియా క్లీన్‌స్వీప్

39 స్థానాలు కూటమివే • ప్రభావం చూపని ఏఐఏడీఎంకే, ఎన్డీయే

చెన్నై, జూన్ 4: తమిళనాడులో ఇండియా కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అధికార డీఎంకే సారథ్యంలో బరిలోకి దిగిన ఆ కూటమి గత సార్వత్రిక ఎన్నికలను మించి ఫలితాలను సాధించింది. రాష్ట్రంలోని మొత్తం 39 స్థానాలను కైవసం చేసుకుంది. కూటమి హవా ముందు ఏఐఏడీఎంకే, ఎన్డీయే తేలిపోయాయి. ఆ రాష్ట్రంలోని మొత్తం 39 స్థానాలకు గానూ 22 చోట్ల గెలుపొందిన డీఎంకే తన పట్టును నిలుపుకొన్నది. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ 9, సీపీఐ(ఎం) 2, వీసీకే 2, సీపీఐ 2 స్థానాల్లో గెలుపొందగా.. ఎండీఎంకే, ఐయూఎంఎల్ ఒక్కోచోట విజయం సాధించాయి. కాగా, ఏఐఏడీఎంకే ప్రభావాన్ని చూపలేదు. మరోవైపు పీఎంకేతో పొత్తు పెట్టుకొని బరిలో దిగిన బీజేపీ అనుకున్న ఫలితాలను రాబట్టలేకపోయింది. తమిళనాడులో ఈసారి మెరుగైన ఫలితాలను పొందాలనుకున్న ఆ పార్టీ ఆశలు ఫలించలేదు. ప్రధాని మోదీ సహా బీజేపీ హేమాహేమీలు ప్రచారం చేసినప్పటికీ కమలం పార్టీ గతి మారలేదు.

తెలంగాణ మాజీ గవర్నర్ తమిళి సై కూడా ఓటమి పాలయ్యారు. బీజేపీ తరపున చెన్నై సౌత్ స్థానంలో బరిలోకి దిగిన తమిళి సై.. డీఎంకే అభ్యర్థి టి.సుమతి చేతిలో ఘోరంగా ఓడిపోయారు. 10కి పైగా ఓటింగ్ శాతాన్ని పొందడమే కమలం పార్టీకి కాస్త ఊరట కలిగించే అంశం.

తమిళనాడు(39)	
ఇండియా	39
ఎన్డీయే	0

ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఓడిపోయారు.

కేరళలో యూడీఎఫ్ హవా

- 18 లోక్‌సభ స్థానాలు కైవసం
- ఒక్కసీటుకే ఎల్డీఎఫ్ పరిమితం
- రాష్ట్రంలో బోణీ కొట్టిన బీజేపీ
- వయనాడ్‌లో రాహుల్ గెలుపు

తిరువనంతపురం, జూన్ 4: కేరళలో 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రిపీట్ అయ్యాయి! 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడీఎఫ్ కూటమికి భారీ విజయం దక్కింది. కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలుపొందింది. మొత్తం 20 ఎంపీ స్థానాల్లో యూడీఎఫ్ కూటమి 18 స్థానాల్ని కైవసం చేసుకుంది. వామపక్షాల నేతృత్వంలోని అధికార ఎల్డీఎఫ్ కూటమి ఒక్క స్థానానికే పరిమితమైంది. బీజేపీ తొలిసారిగా ఇక్కడ ఒక్క స్థానాన్ని కైవసం చేసుకుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ వయనాడ్ నియోజకవర్గంలో 6,47,445 ఓట్లతో గెలుపొందారు. తిరువనంతపురం స్థానంలో కాంగ్రెస్-బీజేపీ మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్టుగా సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్ 16,077 ఓట్ల మెజార్టీతో (పోలైన ఓట్లు 3,58,155) గెలుపొందారు.

త్రిసూర్‌లో సురేశ్ గోపి విజయం

కేరళలో కనీసం ఒక్క ఎంపీ స్థానమైనా గెలవాలని కలలుగన్న బీజేపీ తాజా ఎన్నికల్లో దానిని సాకారం చేసుకుంది. ఆ పార్టీకి చెందిన సురేశ్ గోపి త్రిసూర్ నియోజకవర్గంలో గెలుపొందారు. 74,686 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి, సీపీఐ అభ్యర్థి సునీల్‌కుమార్‌పై విజయం సాధించారు. రాజ్యసభ ఎంపీగా సురేశ్ గోపీ మూడేండ్లపాటు త్రిసూర్‌పై దృష్టిసారించటం తాజా గెలుపునకు దారి తీసింది. ఈ ఏడాది జనవరిలో జరిగిన సురేశ్ గోపీ పెద్ద కుమార్తె వివాహానికి ప్రధాని మోదీ స్వయంగా హాజరుకావటం రాజకీయంగా ఆయనకు బాగా కలిసివచ్చింది.

కేరళ (20)	
యూడీఎఫ్	18
ఎల్డీఎఫ్	1
బీజేపీ	1

బీహార్.. ఇండియా కూటమి బేజార్

- 40లో 30 స్థానాలు గెలిచిన ఎన్డీయే
- ఇండియా కూటమికి 9 స్థానాలే
- ఐదు సీట్లు కోల్పోయిన బీజేపీ

బీహార్ (40)	
ఎన్డీయే	30
ఇండియా	9
స్వంతంత్రులు	1

పట్నా: బీహార్‌లో ఎన్డీయే కూటమి మరోసారి స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించింది. రాష్ట్రంలో 40 లోక్‌సభ స్థానాలు ఉండగా ఎన్డీయే కూటమికి 30 స్థానాలు దక్కాయి. ఎన్నికల ముంగిట బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎన్డీయేలో చేరడం ఆ కూటమికి బాగా కలిసొచ్చింది. ఇండియా కూటమి విజయావకాశాలను నితీశ్ భారీగా దెబ్బకొట్టారు. కాగా, బీహార్‌లో ఇండియా కూటమి కేవలం తొమ్మిది స్థానాలకే పరిమితమైంది.

బీజేపీకి తగ్గిన సీట్లు

బీహార్‌లో బీజేపీకి ఎన్నికల్లో ఐదు స్థానాలు తగ్గాయి. 2019లో 17 స్థానాల్లో